# సాక్షి నంద్యాల

మంగళవారం। 24। జూన్। 2025






**మొక్కజొన్న రైతుకు కన్నీటి కష్టాలు**

ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న పంట చేసిన రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. వర్షం లేకపోవడంతో నీటి కుంటలను ఆశ్రయిస్తున్నారు. 8లో▸



**పట్టపగలే భారీ చోరీ**

ఆత్మకూరు పట్టణంలో సోమవారం మధ్యాహ్నం భారీ చోరీ జరిగింది. దాదాపు 69 తులాల బంగారు ఆభరణాలు, రూ.27 లక్షల నగదును అపహరించారు. 8లో▸



**టీబీ డ్యాం సమాచారం**

| | |
|---|---|
| పూర్తి మట్టం | :1,633 అడుగులు |
| ప్రస్తుతం | :1,614.68 |
| టీఎంసీల సామర్థ్యం | :105.788 |
| ప్రస్తుతం | :47.753 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | :21,612 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | :194 |

## న్యూస్‌రీల్

### నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న పండితులు

మహానంది: మహానందీశ్వరస్వామి గర్భాలయం ఎదురుగా ఉన్న శ్రీ నందీశ్వరస్వామికి సోమవారం సాయంత్రం ప్రదోష కాలంలో విశేష ద్రవ్యాభిషేకం నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, మహానందీశ్వర ఆలయ అర్చకులు మూలస్థానం సుబ్బయ్యశర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ముందుగా గణపతిపూజ, పంచామృతాలు, విశేష ద్రవ్యాలు, వట్టివేర్లతో పాటు క్షీరాభిషేకం చేశారు. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవల ద్వారా నందీశ్వరాభిషేకం వీక్షించి స్వామివారి పూజలో పాల్గొన్నారు.

### శ్రీశైలానికి స్వల్పంగా తగ్గిన వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్వల్పంగా తగ్గింది. గత ఆదివారం ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 76,178 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చింది. జూరాల ప్రాజెక్ట్ నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సుంకేసుల నుంచి నీటి విడుదల నిలిచిపోయింది. దీంతో ఆదివారం నుంచి సోమవారం వరకు 60,336 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరింది. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పాదనను గత ఐదు రోజుల నుంచి నిలిపివేశారు. బ్యాక్ వాటర్ నుంచి కూడా దిగువ ప్రాంతాలకు నీటి విడుదల నిలిలిచిపోయింది. సోమవారం సాయంత్రం సమయానికి జలాశయంలో 97.1760 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 857 అడుగులకు చేరుకుంది.

### పంచమఠాల్లో విశేష పూజలు



ఘంటామఠంలో గణపతికి విశేషపూజలు నిర్వహిస్తున్న దేవస్థాన ఈఓ దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం పంచమఠాల్లో సోమవారం అభిషేకం, పుష్పార్చనలు చేపట్టారు. ఉదయం ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం ప్రతి సోమవారం ఉదయం పంచమఠాలలోని దేవతామూర్తులకు విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. క్షేత్రాన్ని సందర్శించే భక్తులు పంచమఠాలను కూడా దర్శించే విధంగా భక్తులలో అవగాహన కల్పించేందుకు చర్యలను తీసుకుంటామన్నారు. ఈ పూజా కార్యక్రమంలో స్వామివార్ల ప్రధానార్చకులు హెచ్.వీరయ్య స్వామి, ఆలయ విభాగం ఏఈవో ఎం.హరిదాసు, పర్యవేక్షకులు కె.శివప్రసాద్, ఆలయ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

### ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు తల్లికి వందనం నిధులు విడుదల కావాలంటే తల్లి పోస్టల్ లేదా బ్యాంకు ఆధార్ నెంబర్ ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ చేయాలని ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారిణి కె.తులసీ దేవి తెలిపారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని ఎంపీడీఓ, ఏఎస్‌డబ్ల్యూఓ, గ్రామ/వార్డు సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు తమ పరిధిలోని అర్హత కలిగిన విద్యార్థులను గుర్తించి ఎన్‌పీసీఐ లింకు చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 9, 10 తరగతులకు చెందిన 164 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే 764 మంది ఇంటర్మీడియట్ విద్యార్థుల తల్లుల ఖాతాలకు కూడా ఎన్‌పీసీఐ లింక్ కాలేదన్నారు.

### ఆశా కార్యకర్త పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల ఉద్యోగాల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 32, పట్టణ ప్రాంతాల్లో 12 ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు, జీతం మొదలైన వివరాలు, దరఖాస్తు నమూనాలు https://kurnool.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# గర్జించిన యువత



నూనెపల్లె బ్రిడ్జి నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుంటున్న యువత, విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నాలుగు లక్షల ఉద్యోగాలు ఏవి? మూడు వేల నిరుద్యోగ భృతి ఎక్కడ? ఫీజు బకాయిలు ఇంకెప్పుడు?.. అంటూ యువత గర్జించింది. కూటమి మోసాన్ని పిడికిలి బిగించి నిలదీసింది. సీఎం చంద్రబాబు హామీలకు ష్యూరిటీ ఉండదని.. భవిష్యత్‌కు గ్యారెంటీ లేదంటూ నినదించింది. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రం నంద్యాలలో చేపట్టిన 'యువత పోరు' విజయవంతమైంది. కూటమి ప్రభుత్వ తీరును ఎండగడుతూ యువతి, యువకులు, విద్యార్థులు చేసిన నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది.

- కూటమి మోసాన్ని నిలదీసిన నిరుద్యోగులు, విద్యార్థులు
- ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని డిమాండ్
- బాబూ.. ఉద్యోగాల కల్పన ఏదంటూ నిరసన
- వైఎస్సార్‌సీపీ 'యువత పోరు' విజయవంతం

నంద్యాల: కూటమి ప్రభుత్వ వంచనపై జిల్లా యువత పోరుబాట పట్టింది. సీఎం చంద్రబాబు నాయుడు చేసిన మోసం, అన్యాయాలను నిరుద్యోగ యువతీ, యువకులు, విద్యార్థులు అడుగడుగునా ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు తలపెట్టిన 'యువత పోరు' కార్యక్రమం నంద్యాల జిల్లా కేంద్రంలో విజయవంతంగా సాగింది. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి యువత, విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. పట్టణంలోని నూనెపల్లె ఓవర్ బ్రిడ్జి నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో 'నిరుద్యోగ భృతి రూ.3వేలు ఎప్పుడిస్తావ్ బాబు, బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, ఉద్యోగాలు వేసుడు లేదు.. పీకుడే, 20 లక్షల జాబ్స్ అన్నావు.. ఉన్న జాబ్స్ తీసేస్తున్నావ్.. వంటి ప్లకార్డులతో యువత కలెక్టరేట్ కార్యాలయం వరకు ప్రదర్శించారు. సీఎం చంద్రబాబు డౌన్..డౌన్.. ఇచ్చిన హామీలు అమలు చేయని చంద్రబాబు రాజీనామా చేయాలి.. తదితర నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని ఆందోళన చేశారు. విద్యార్థులు, యువత, వైఎస్సార్‌సీపీ నాయకులు కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. కేవలం 10 మందిని మాత్రమే కలెక్టరేట్‌లోకి వినతి పత్రం ఇచ్చేందుకు అనుమతించారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఉన్న డీఆర్‌ఓ రాము నాయక్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విజయ్‌చౌదరి, యూనిస్ బాషా, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి మాధురి గౌడ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా జోనల్ అధ్యక్షురాలు గాజుల శ్వేతారెడ్డి, రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ రాజు నాయుడు, నాయకులు నందికొట్కూరు అబ్దుల్లా, శ్రీశైలం రియాజ్, బనగానపల్లె శ్రీనివాసులు, పాణ్యం రాకేష్, డోన్ ప్రకాష్ రెడ్డి, నంద్యాల నాయక్, ఆళ్లగడ్డ వెంకటేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు రసూల్ ఆజాద్, శ్రీరాములు, రామ్మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, రాకేష్, సుమంత్‌కుమార్, యువత, విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి



కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్తున్న యువతను అడ్డుకుంటున్న పోలీసులు



డీఆర్‌ఓ రామునాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

### పేదల చదువులు అగమ్యగోచరం..

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా ఇంత వరకు సంక్షేమ పథకాలు అమలు చేయలేని దుస్థితి నెలకొందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలు ఊసే లేకుండా పోయాయన్నారు. పేద కుటుంబాల్లో పిల్లల చదువులు అగమ్యగోచరంగా మారాయన్నారు. 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ గతంలో ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇంకా పెండింగ్‌లో పెట్టారన్నారు. ప్రభుత్వం విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### నిరుద్యోగులకు అన్యాయం

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చి యువతను మోసం చేసిందన్నారు. ఏటా జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నేడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఎన్నికల సమయంలో యువతకు గాలం వేసి ఓట్లు దండుకునేందుకు యువగళం పేరుతో లోకేష్ పాదయాత్ర చేశారన్నారు. ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేస్తానని, ప్రభుత్వ ఉద్యోగాలను ఏటా భర్తీ చేస్తామని, ఏడాదికి 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఊదరగొట్టి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇంత వరకు కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయలేదన్నారు. ఉద్యోగాలు కల్పించలేని వారికి నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేశారన్నారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 2.25 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తు చేశారు. తాత్కాలిక ఉద్యోగులను ఆప్కాస్ కిందకు తెచ్చి ఉద్యోగ భద్రత కల్పించిందన్నారు.

### మోసం చంద్రబాబు నైజం..

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, దాల్‌మిల్ అమీర్, పీపీ మధుసూదన్ రెడ్డి.. మాట్లాడుతూ విద్యార్థులు, యువతకు అండగా వైఎస్సార్‌సీపీ ఎప్పుడు ఉంటుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అధికారం కోసం ఎడాపెడా హామీలు గుప్పించేసి గద్దెనెక్కాక వాటిని గాలికి వదిలేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఎన్నికల్లో సూపర్-6 పథకాలు అంటూ ప్రజలను మభ్యపెట్టి వారిని దారుణంగా మోసం చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు విడుదల చేసే వరకు వైఎస్సార్‌సీపీ విద్యార్థులు, యువత వెంట ఉంటూ పోరాటం చేస్తుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేసిందన్నారు. 2014-19లో చంద్రబాబు సర్కార్ బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సైతం చెల్లించి విద్యార్థులను ఉన్నత విద్యవైపు జగనన్న ప్రభుత్వం ప్రోత్సహించిందన్నారు. అమ్మ ఒడి, నాడు-నేడు వంటి పథకాలు విద్యార్థుల విద్యాభివృద్ధికి వైఎస్ జగన్ ఎంతో కృషి చేశారన్నారు.

# ఇల్లు ఎట్లా గడిచేది?



కోవెలకుంట్ల సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- జిల్లాలో రూ. 112 కోట్లు పెండింగ్
- వేతనాలందక భారంగా కుటుంబ పోషణ

కోవెలకుంట్ల: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలను వేతనాల సమస్య వెంటాడుతోంది. చేసిన పనులకు వారాల తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారటంతో అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 4.38 లక్షల జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 8.70 లక్షల మంది కూలీలు ఉన్నారు. 1.50 లక్షల కుటుంబాల్లోని 2.55 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆయా మండలాల్లో 78,23,780 పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం రూ. 335 కోట్ల లేబర్ (కూలీల వేతనం, మెటీరియల్ కలిపి)బడ్జెట్ కేటాయించారు. గతంలో ప్రతి రెండు వారాలకొకసారి వేతనాలు అందేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో నెలల తరబడి వేతనాలు అందక, ప్రభుత్వం నిర్ణయించిన సగటు వేతనం రాక కూలీలు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఉపాధి పనులకు వెళుతున్న కూలీలకు 10-12 వారాల నుంచి వేతనాలు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇద్దరు సభ్యులున్న ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 30 వేల చొప్పున వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో రూ. 112 కోట్ల వేతనాలు విడుదల కావాల్సి ఉంది.

**వ్యవసాయ పనుల్లేక.. ఉపాధి వేతనం అందక**

ఈ ఏడాది జూన్ నెల నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా పూర్తిస్థాయి వ్యవసాయ పనులు ప్రారంభం కాకపోవడంతో వ్యవసాయ పనులు లేక మరో వైపు ఉపాధి పనులకు వెళుతున్నా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, నిత్యావసరాలు, తదితర సరుకులను అప్పులు చేసి తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. రెండు నెలలకు పైబడి వేతనాలు ఇవ్వకపోవడంతో వ్యాపారులు అప్పులు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదని కూలీలు పేర్కొంటున్నారు. జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలకు మే 10వ తేదీ వరకు చేసిన పనులకు వేతనాలు చెల్లించగా ఎక్కువ శాతం గ్రామాల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వేతనాలు సక్రమంగా అందకపోవడంతో జిల్లాలో ఈ నెల నుంచి 50 వేల మంది కూలీలు మాత్రమే ఉపాధి పనులకు వెళుతున్నారు.

**అప్పులు చేస్తున్నాం**



12 వారాల నుంచి చెరువులో పూడికతీత, ఫారం పాండ్స్ తవ్వకం, ఎస్సార్సీలో పూడిక తీత వంటి పనులకు వెళుతున్నాను. వారాల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కూరగాయలు, నిత్యావసర సరుకులు అప్పులు చేసి కడుపునింపుకోవాల్సి వస్తోంది. అధికారులు త్వరితగతిన బిల్లులు విడుదల చేసి ఆదుకోవాలి.

– శోభారాణి, ఉపాధి కూలీ, కోవెలకుంట్ల

**రూ. 15 వేలు రావాలి**



రోజుకు 250 రూపాయలు కూలి కోసం రెక్కలు ముక్కలు చేసుకుని పనులు చేస్తున్నాం. ఎనభై రోజుల నుంచి పనులకు వెళుతున్నా.. ఇప్పటి వరకు కూలీ డబ్బులు రాలేదు. దాదాపు రూ. 15 వేల వరకు వేతనాలు అందాల్సి ఉంది. డబ్బులు లేక పూట గడవటం కష్టంగా ఉంది. అధికారులు చేసిన పనులకు వెంటనే డబ్బులు చెల్లించి ఆదుకోవాలి.

– రాములమ్మ, ఉపాధి పథక మేటీ కోవెలకుంట్ల

### నేటి నుంచి మహిళా సర్పంచులకు శిక్షణ

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మహిళా సర్పంచులకు ' స్థానిక పాలనలో మహిళా సాధికారత ' అనే అంశంపై ఈ నెల 24 నుంచి జూలై 10వ తేదీ వరకు 11 బ్యాచుల్లో శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్, జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. రాష్ట్ర పీఆర్ అండ్ ఆర్‌డీ, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమాలను డివిజన్, మండల స్థాయిల్లో కొనసాగిస్తామన్నారు. కర్నూలు డివిజన్‌కు చెందిన మహిళా సర్పంచులకు జెడ్పీ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో, ఆదోని డివిజన్‌కు చెందిన వారికి ఆదోనిలోని ఎంపీపీ హాల్, పత్తికొండ డివిజన్‌కు చెందిన వారికి పత్తికొండలోని ఎంపీపీ హాల్‌లో శిక్షణా తరగతులను నిర్వహిస్తామన్నారు. అలాగే నంద్యాల జిల్లాలోని నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్ల పరిధిలోని మహిళా సర్పంచులకు ఆయా డివిజన్ కేంద్రాల్లోని ఎంపీపీ హాల్స్‌లో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు.

# 26 ఎకరాలైనా చూపించండి... తల్లికి వందనమైనా ఇప్పించండి!



తహసీల్దార్ నాగరాజుకు అర్జీ అందజేస్తున్న మహిళ గాయత్రి

కోడుమూరు రూరల్: ' నా ముగ్గురు పిల్లలకు ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకం కింద డబ్బులు రాలేదు. కారణం అడిగితే 26 ఎకరాల పొలముందంటూ చెబుతున్నారు.. డబ్బులైనా ఇప్పించండి.. లేదా పొలమైనా చూపించండంటూ' కోడుమూరుకు చెందిన గాయత్రి అనే మహిళ అధికారులను వేడుకుంటోంది. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ నాగరాజుకు మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు నలుగురు సంతానం కాగా, ముగ్గురు కుమార్తెలు, రెండేళ్లలోపు ఒక బాలుడు ఉన్నారన్నారు. ఇందులో ముగ్గురు కుమార్తెలు ప్రస్తుతం 1, 4, 5వ తరగతులు చదువుతున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం డబ్బులు జమ కాలేదన్నారు. విషయం తెలుసుకోగా తమ కుటుంబం పేరు మీద 26 ఎకరాల భూమి ఉన్నట్లుగా చూపిస్తోందని, దీని వల్ల తమకు తల్లికి వందనం పథకం డబ్బులు పడలేదని వాపోయారు. తమ పేరు మీద కేవలం ఎకరా 85 సెంట్ల భూమి మాత్రమే ఉందని, అధికారులు చర్యలు తీసుకుని తమకు తల్లికి వందనం పథకం వర్తించేలా చూడాలని ఆమె తహసీల్దార్‌తో మొరపెట్టుకున్నారు. గాయత్రి ఇచ్చిన అర్జీని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

# ఎల్లెల్సీ పనుల్లో టీడీపీ 'పైసా'చికం!

- తూతూ మంత్రంగా తుంగభద్ర దిగువ కాలువ పనులు
- కొరవడిన ఇంజినీర్ల పర్యవేక్షణ
- కమీషన్లు ఇవ్వాలని టీడీపీ నేతల ఒత్తిళ్లు?



ఎల్లెల్సీలో అస్తవ్యస్తంగా లైనింగ్ పనులు

ఆలూరు: నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వకుండా నాసిరకంగా తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ ) పనులు చేస్తున్నారు. టీడీపీ నేతలు కమీషన్లు ఇవ్వాలని ఒత్తిళ్లు చేస్తుండటంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేసి బిల్లులను దండుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇంజినీర్ల పర్యవేక్షణ లేకపోవడంతో ఎల్లెల్సీ పనుల్లో నాణ్యత కొరవడింది. ఆలూరు నియోజకవర్గంలో 135 కి.మీ. వద్ద ఎల్లెల్సీ కనిపిస్తుంది. ప్రస్తుతం 135 కి.మీ. నుంచి 138 వరకు, హాలహర్వి మండలంలో 155 నుంచి 156 కి.మీ. వరకు, అలాగే 220 నుంచి 222 కి.మీ. వరకు ఎల్లెల్సీ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. కాలువ పరిధిలో 155 నుంచి 156 కి.మీ. వరకు 950 మీటర్ల మేర లైనింగ్ సైడ్ వాల్ కడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా 10 ఎంఎం కడ్డీలకు బదులు 8 ఎంఎం కడ్డీలు వాడుతున్నారు. అలాగే 20 ఎంఎం చిప్స్‌కు బదులు 15 ఎంఎం చిప్స్‌ను, నాణ్యతలేని ఇసుకను వినియోగిస్తున్నారు.

**'చిన్న'బోయిన పనులు**

కాలువ 155 నుంచి 156 కి.మీ. వరకు చిన్నగా ఉంది. అధిక క్యూసెక్కుల నీటిని తట్టుకోవాలంటే అందుకు కాలువ ఎత్తుతోపాటు డిజైనింగ్ కోసం రూ.6.5 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం కాంట్రాక్టర్లు రాళ్లపైనే కడ్డీలను కడుతున్నారు. దీంతో కాలువ నీటి ప్రవాహంలో అవి కొట్టుపోయే పరిస్థితి నెలకొంది.

- ➤ చింతకుంట పరిధిలో 136 నుంచి 138 కి.మీ. వరకు జరుగుతున్న పనులకు ముందుగా ఎర్ర మట్టి వేయాలి. అలాకాకుండా పనులు కొనసాగిస్తున్నారు.
- ➤ హొళగుంద పరిధిలో 202 నుంచి 222 కి.మీ. వరకు లైనింగ్ పనులు చేయగా అప్పుడే పెచ్చులూడిపోయాయి.

**ఇదీ దుస్థితి..**

ఖరీఫ్ సీజన్‌లో సాగు, తాగునీటి విడుదలపై ఈనెల 27న తుంగభద్ర బోర్డు అధికారులు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అయితే ఎల్లెల్సీ పనులు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో జరగలేదు. పనులు నాసిరకంగా ఉన్నాయి. ఈఈ, డీఈఈల పర్యేక్షణ అంతంతా మాత్రంగానే ఉంది. కాలువలో నీరు దిగువకు వచ్చేనా అని ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు డివిజన్లకు సంబంధించిన ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఫిర్యాదులు ఇవీ..**

ఎల్లెల్సీ పనులు చేసే కాంట్రాక్టర్లు కచ్చితంగా కమీషన్లు ఇవ్వాలని టీడీపీ నేతలు బెదిరిస్తున్నారు. డబ్బులు ఇవ్వకుంటే పనులు చేయించబోమని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇంజినీర్లపై కూడా ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. టీడీపీ నేతలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులపై చర్యలు తీసుకోవద్దంటూ టీడీపీ ప్రజాప్రతినిధులతో చెప్పించిట్లు తెలుస్తోంది.

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


విజయ్ (ఫైల్)

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గూటుపల్లె విజయ్, తెలుగు మహేష్ ఆదివారం అర్ధరాత్రి బైక్‌పై ప్రధాన రహదారిపైకి వస్తుండగా మద్దిలేటి స్వామి ఆలయ ముఖ ద్వారం వద్ద అదే సమయంలో బేతంచెర్ల వైపు నుంచి డోన్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ప్రమాదవశాత్తు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్రగాయాల పాలైన గూటుపల్లె విజయ్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన తెలుగు మహేష్‌ను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. మృతుడు మహేష్‌కు భార్య పవిత్ర ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు. కాగా అదే ప్రాంతంలో కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో మరో ఇద్దరు గాయపడ్డారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### పొలం రస్తా తగాదా.. రైతు ఆత్మహత్య


గోపాల్ (ఫైల్)

ఆలూరు రూరల్: పొలం రస్తా విషయంలో పక్కన పొలానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తితో గొడవ పడి గోపాల్ (43) అనే రైతు పురుగుల మందుతాగి ఆత్మహ్యత చేసుకున్నాడు. మండలంలోని హులేబీడు గ్రామంలో ఆదివారం రాత్రి ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ మహబూబ్ తెలిపిన వివరాలు.. పొలం రస్తా విషయంలో హులేబీడు గ్రామానికి చెందిన వెంకటేష్‌తో గోపాల్‌కు కొన్ని రోజుల నుంచి తగాదాలు ఉన్నాయి. ఆదివారం సాయంత్రం వెంకటేష్‌తో గోపాల్ గొడవపడ్డాడు. రస్తా విషయం ఎప్పటికీ తెగదని మనస్తాపానికి గురైన గోపాల్ (43) ఆదివారం రాత్రి పురుగుల మంది తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బంధువులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిచారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. 108 అంబులెన్సులో తరలిస్తుండగా గోపాల్ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడి భార్య తాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహబూబ్ బాషా విలేకరులకు తెలిపారు.

# మొక్కజొన్న రైతుకు కన్నీటి కష్టాలు

- వానలు లేక వాడు పడుతున్న పంట
- కుంటనీటిని మెటార్లసాయంతో పైరుకు మళ్లింపు


కుంటకు ట్రాక్టర్ సాయంతో ఇంజిన్లు అమర్చిన దృశ్యం

కోవెలకుంట్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇరవై రోజులు దాటినా వరణుడు పూర్తిస్థాయిలో కరుణించకపోవడంతో రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. వర్షాధారంగా మొక్కజొన్న పంటను సాగు చేసిన రైతులు అదునుకు వర్షం పడకపోవడంతో సాగునీటిని మళ్లించుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కోవెలకుంట్లకు చెందిన రాముడు మండలంలోని గుంజలపాడు సమీపంలో ఎకరారూ. 15 వేలు కౌలు చెల్లించి నాలుగు ఎకరాల పొలంలో మొక్కజొన్న సాగు చేశాడు. పైరు నెల రోజుల దశలో ఉండగా సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో సాగునీటి మళ్లింపుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. పైరుకు రెండు కి.మీ దూరంలో ఎస్సార్బీసీ 10వ బ్లాక్ కాల్వ పక్కన ఉన్న కుంటలో నీరు సంవృద్ధిగా ఉంది. ఆ కుంటకు ట్రాక్టర్ ఇంజిన్ సాయంతో రెండు మోటార్లు అమర్చి నీటిని పక్కనే ఉన్న ఎస్సార్బీసీలోకి వదిలి అక్కడి నుంచి పొలానికి సమీపంలో కాల్వకు మరో డీజిల్ ఇంజిన్ ఏర్పాటు చేసి పైపుల ద్వారా పొలానికి సాగునీరు మళ్లించుకుంటున్నాడు. ట్రాక్టర్, డీజిల్ ఇంజిన్లు, పైపులు సొంతంగా ఉన్నప్పటికి డీజిల్, కూలీల రూపంలో ఒక్కో తడికి రూ. 10 వేలు వెచ్చించాల్సి వస్తోందని రైతు పేర్కొన్నాడు. ట్రాక్టర్, ఇంజిన్లు సొంతంగా లేకపోతే అదనంగా మరో రూ. 10 వేలు భారం పడేదన్నారు. ఎస్సార్బీసీకి సాగునీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


ఎస్సార్బీసీలోకి సాగునీటిని విడుదల చేసిన దృశ్యం


డీజిల్ ఇంజిన్ సాయంతో పైప్‌లైన్ ద్వారా నీటిని మళ్లిస్తున్న రైతు


మొక్కజొన్న పంటకు సాగునీటిని మళ్లిస్తున్న రైతు

### ఘనంగా శివపార్వతుల కల్యాణం


ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాసశివరాత్రి సందర్భంగా స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన

### పుస్తకపాణిగా కొలనుభారతి దేవి


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కొత్తపల్లి: శివపురం గ్రామం సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలను భారతి దేవి పుణ్య క్షేత్రంలో సరస్వతీ దేవి అమ్మవారు పుస్తకపాణిగా భక్తులకు దర్శమిచ్చారు. బహుళ త్రయోదశి సోమవారం అమ్మవారు భక్తుల ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, బిల్వార్చన, అభిషేకం, మంగళహారతి వంటి విశేష పూజలు చేశారు. సోమవారం కావడంతో భక్తులు అమ్మవారిని సుదూర ప్రాంతాల నుంచి వచ్చి, వారి చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించుకున్నారు.

### తప్పుడు సమాచారంతో ఆర్‌టీఐ చట్టానికి తూట్లు

కర్నూలు(సెంట్రల్): తప్పుడు సమాచారంతో దేవనకొండ తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారని రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షుడు వీ‌నాయుడు ఆరోపించారు. సోమవారం ఏక్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేవనకొండ తహశీల్దార్ కార్యాలయంలో ఏదైనా సమాచారం కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు లేనిపోని ప్రశ్నలు సంధించి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇటీవల తాను గుండ్లకొండ రెవెన్యూపరిధిలోని సర్వే నంబర్ 772లోని భూములకు సంబంధించిన పత్రాల కోసం దరఖాస్తు చేశానని, ఆలస్యంగా సర్వే నంబర్ 777 సర్వే సమాచారం ఇచ్చారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

## డ్రోన్ టెక్నాలజీపై నైపుణ్యాభివృద్ధి సదస్సు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీలో వారం రోజుల పాటు డ్రోన్ టెక్నాలజీపై ఫ్యాకల్టీకి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ఏర్పాటు చేశారు. సోమవారం ఆ వర్సిటీలో కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రోన్ టెక్నాలజీపై క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న ఫ్యాకల్టీకి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్(ట్రిపుల్ఐటీడీఎం)కి చెందిన ప్రొఫెసర్లు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సహకారంతో నీట్ వరంగల్‌కి చెందిన ఈఅండ్ ఐసీటీ అకాడమీ డ్రోన్ టెక్నాలజీపై నైపుణ్యాభివృద్ధికి ఇచ్చిన స్పాన్సర్‌తో ట్రిపుల్ఐటీడీఎంకి చెందిన వారు ఫ్యాకల్టీకి శిక్షణ ఇస్తున్నారన్నారు. అధ్యాపకులు డ్రోన్ టెక్నాలజీపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓర్వకల్లు ప్రాంతంలో ఏర్పాటు కానున్న డ్రోన్ హబ్‌లో విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా అధ్యాపకులు శిక్షణ పొందితే విద్యార్థులకు అందుబాటులోకి రానున్న డ్రోన్ టెక్నాలజీ కోర్సులపై బోధన చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఆ తరువాత ట్రిపుల్ఐటీడీఎం ప్రాజెక్టు పరిశోధకులు డాక్టర్ కృష్ణ నాయక్ డ్రోన్ టెక్నాలజీ గురించి వివరించారు. క్లస్టర్ యూనివర్సిటీ కో–ఆర్డినేటర్ పద్మావతి, ట్రిపుల్ఐటీడీఎం కో–ఆర్డినేటర్ కె.వి.ఈశ్వరమూర్తి పాల్గొన్నారు.

### ఐటీ ఇంజినీర్ దుర్మరణం

దొడ్డబళ్లాపురం: బెంగళూరులో బాణసవాడి పీఎస్ పరిధిలో హిట్ అండ్ రన్‌లో ఓ టెక్కీ మృతి చెందాడు. మృతున్ని కర్నూలుకు చెందిన సలగున ప్రదీప్ (25)గా గుర్తించారు. ఓ సంస్థలో ఐటీ ఇంజినీర్‌గా పని చేస్తున్న ప్రదీప్ కల్కెరెలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. బైక్‌పై కళ్యాణ్ నగరకు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో మరణించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల చిత్రాల ఆధారంగా ఢీకొన్న వాహనం కోసం శోధిస్తున్నారు.

## 12, 13 తేదీల్లో తెలుగు భాషా పరిరక్షణ సదస్సు


సదస్సు బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సును జులై 12, 13 తేదీల్లో కర్నూలు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు సదస్సు కన్వీనర్ పత్తి ఓబులయ్య తెలిపారు. సోమవారం కళాక్షేత్రంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు ఒక వేదికను ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయి సదస్సును ఏర్పాటు చేస్తున్నామన్నారు. సదస్సు అధ్యక్ష ఉపాధ్యక్షులు చంద్రశేఖర కల్కూర, జీఎస్ ఆర్కే శర్మ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారన్నారు. మొదటి రోజు కొండారెడ్డి బురుజు సమీపంలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి సదస్సు జరిగే వేదిక వరకు పాదయాత్ర జరుగుతుందన్నారు. రెండో రోజు జరిగే సదస్సులో బోధనా భాషగా తెలుగు, మాతృ భాషగా తెలుగు, అధికార భాషగా తెలుగు, ప్రథమ భాషగా తెలుగు అనే అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, విశ్రాంత ఐఏఎస్ ముక్తేశ్వరరావు, తమిళనాడు రాష్ట్రం తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు తూమాటి సంజీవరావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాజపాళెం చంద్రశేఖర రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొని సందేశమిస్తారన్నారు. తెలుగు భాషాభివృద్ధిపై కవి సమ్మేళనం, పేపర్ ప్రజెంటేషన్ ఉంటుందన్నారు. సాహిత్యాభిమానులు, తెలుగు భాషాభిమానులందరూ సదస్సులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సదస్సు కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, సభ్యులు సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే భారీ చోరీ

- 60 తులాల బంగారం, రూ. 27 లక్షల నగదు అపహరణ


చోరీ జరిగిన ఇల్లు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలోని సాయిబాబా నగర్‌లో సోమవారం మధ్యాహ్నం భారీ చోరీ జరిగింది. ఇరిగేషన్ శాఖలో ఇంజనీర్‌గా ఉన్న శరభారెడ్డి ఇంటిని దొంగలు లూటీ చేశారు. దాదాపు 60 తులాల బంగారు ఆభరణాలు, రూ. 27 లక్షల నగదును దోచుకెళ్లారు. ఇటీవల శరభారెడ్డి కుమార్తె వివాహం జరిగింది. కాగా నల్లకాల్వ సమీపంలో ఉన్న వైఎస్సార్ స్మృతివనంలో పోస్ట్ వెడ్డింగ్ ఫొటో షూట్ కోసం ఉదయం కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉంచిన నగదు, బంగారు ఆభరణాలు అపహరించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో పోస్ట్ వెడ్డింగ్ ఫొటో సెషన్ పూర్తి చేసుకుని ఇంటికి చేరుకున్న కుటుంబీకులు ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించి లబోదిబోమన్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రాము సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## పోక్సో కేసు నమోదు

కోడుమూరు రూరల్: కోడుమూరులో మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి బలవంతంగా పసుపు తాడు కట్టిన ఓ యువకుడిపై పోక్సో కేసు ఆదివారం రాత్రి నమోదు చేసినట్లు కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామి సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కోడుమూరుకు చెందిన ఓ మైనర్ బాలికకు ఓ యువకుడు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి బలవంతంగా పసుపుతాడు కట్టాడు. జరిగిన విషయాన్ని ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కోడుమూరు పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎర్రిస్వామి యువకుడితో పాటు, యువకుడికి సహకరించిన మహిళ, మరో వ్యక్తిపై పోక్సో, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్, కిడ్నాప్ కేసులను నమోదు చేశారు.

## టీబీ డ్యాంకు 19వ క్రస్టు గేటు లేనట్టే!

- స్టాప్‌లాక్ గేటుతోనే నిర్వహణ
- ఆందోళనలో తుంగభద్ర దిగువ కాలువ రైతులు

కర్నూలు సిటీ: తుంగభద్ర జలాశయంలో గతేడాది ఆగస్టు నెలలో కొట్టుకపోయిన 19వ క్రస్టు గేటు స్థానంలో ఇప్పటి వరకు కొత్తది ఏర్పాటు చేయలేదు. స్టాప్‌లాక్ గేటుతోనే సరిపెట్టుకుంటున్నారు. తుంగభద్ర డ్యాంకు జూన్ నెలలో 47 టీఎంసీలకు నీరు చేరింది. మే నెల 14 నుంచే డ్యాం ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో ఇది సాధ్యమైంది. గతేడాది వరద నీటితో కొట్టుకపోయిన 19వ క్రస్టు గేటు స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు గుజరాత్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. ఈ నెల 20 నుంచి గేటు బిగింపు పనులు మొదలు పెట్టాలని సిద్ధం అయ్యారు. అయితే డ్యాంలోకి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పనులు ఆపేశారు. ఈ ఏడాది నవంబరు తరువాతే గేటు బిగించనున్నట్లు డ్యాం ఇంజినీర్లు చెబుతున్నారు. అధిక వర్షాలు వస్తుండడంతో స్టాప్‌లాక్ గేటు ఏ మేరకు తట్టుకుంటుందోననే ఆందోళన ఆయకట్టుదారుల్లో నెలకొంది.

### పెరుగుతున్న నీటి ప్రవాహం

తుంగభద్ర జలాశయానికి వరద నీటి ప్రవాహం రోజు రోజుకూ పెరుగుతోంది. గత నెల మొదటి వారంలో 6 టీఎంసీల నీరు ఉండేది. ప్రస్తుతం 47 టీఎంసీలకు నీటి నిల్వలు చేరుకున్నాయి. ప్రస్తుతం 21 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం డ్యాంలో వస్తోంది. మరో వారం రోజుల పాటు పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది. స్టాప్‌లాక్ గేటుతో ఏ మేరకు నీరు నిల్వ ఉంటాయోనని ఎల్లెల్సీ, హెచ్చెల్సీ ఆయకట్టుదారుల్లో ఆందోళన నెలకొంది.

### కొత్త గేటు ఏర్పాటు వాయిదా వేశాం

తుంగభద్ర డ్యాం 19వ గేటు స్థానంలో కొత్త గేటు ఏర్పాటుకు ఏజేన్సీ సిద్ధం అవుతుంది. ఈ నెల 20వ తేదీ నుంచే పనులు మొదలు పెట్టాలి. కానీ డ్యాంలో నీటి నిల్వలు సిల్ వె లెవెల్(1613.28 అడుగులు)కు నీరు చేరడంతో గేటు ఏర్పాటు చేయడం కష్టం. ఎందుకంటే గేటు ఏర్పాటుకు స్టాప్‌లాక్ గేటు పైకి తీయాలి. ఇబ్బందింగా ఉండడంతో గేటు బిగింపు పనులు వాయిదా పడ్డాయి.

– నారాయణ నాయక్, టీబీ డ్యాం ఎస్ఈ

## విద్యార్థులకు ఉప్పు నీరే దిక్కు


ఉప్పునీటితోనే దాహం తీర్చుకుంటున్న విద్యార్థులు


వృథాగా ఉన్న ఆర్ఆర్ ప్లాంట్

పత్తికొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులు ఉప్పు నీరు తాగి దాహం తీర్చుకుంటున్నారు. పాఠశాలలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్ఆర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్లాంట్‌ను పట్టించుకోవడం లేదు. దీంతో బడిలో చదువుతున్న విద్యార్థులకు నీటి కష్టాలు తప్పడం లేదు. బాలుర ఉన్నత పాఠశాలలో 900 మంది చదువుకుంటున్నారు. మామూలు సమయంతో పాటు మధ్యాహ్నం భోజనం అనంతరం విద్యార్థులు ఉప్పునీరు తాగుతూ రోగాలు బారిన పడుతున్నారని తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి విద్యార్థులకు మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోండి


ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: ప్రభుత్వ స్థలాలు అక్రమించి ఇతరుల పేర్ల మీద రికార్డులు తయారు చేసి కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్న టీడీపీ నాయకుడు, వ్యవసాయ మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు అధికారులను కోరుతున్నారు. సోమవారం ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్మారం రంగనాయకులు ఆధ్వర్యంలో ఆర్డీఓ నరసింహులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐ వద్ద ఉన్న ప్రభుత్వ భూములు, వంక పోరంబోకు స్థలాలను ఆక్రమించి, అదే స్థలాన్ని తన సొంత స్థలంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చి దాతగా మార్కెట్‌యార్డు చైర్మన్ వ్యవహరించారన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూస్తూ ఊరుకున్నారని వీరిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికార పార్టీ నేత కావడంతో చర్యలు తీసుకోవడంలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆర్డీఓకు వివరించారు. వినతి పత్రం అందించిన వారిలో ఐఎఫ్‌టీయూ నాయకులు రేష, రంగస్వామి, రాముడు, హరి, సుధాకర్, రామనాయుడు తదితరులు ఉన్నారు.

### కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల కౌన్సెలింగ్ కొనసాగుతోంది. జి.పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు హెల్ప్ డెస్క్ సెంటర్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతోంది. రెండో రోజు సోమవారం మొత్తం 200 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను వెరిఫై చేసి, విద్యార్థులకు రిజిస్ట్రేషన్ కమ్ వెరిఫికేషన్ సర్టిఫికెట్‌లను అందజేశారు. హెల్ప్‌లైన్ సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.ఎన్ ప్రసాద్, చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ రామకృష్ణయ్య కౌన్సెలింగ్ ప్రక్రియను పరిశీలించారు. వెరిఫికేషన్‌కు హాజరైన విద్యార్థులు ఈ నెల 25వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చునని కో–ఆర్డినేటర్ తెలిపారు.

### నిరుపయోగం


నిరుపయోగంగా అదనపు తరగతి గదులు

మద్దికెర: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడేళ్ల క్రితం ఆర్ఎంఎస్‌యూ ఫేస్ –3 నిధులతో అదనపు గదులు నిర్మించారు. ఇంతవరకు వాటిని ఉపయోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. లక్షలాది రూపాయలతో నిర్మించిన గదులు ఎలాంటి ఉపయోగం లేకుండా శిథిలావస్థకు చేరుతుండడంతో ప్రజాధనం వృథా అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## తలుపులు తెరుచుకున్న వసతి గృహాలు

సాక్షి ఎఫెక్ట్


విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఆలూరు: ఎట్టకేలకు బీసీ బాలుర వసతి గృహం, ప్రభుత్వ కళాశాల బాలుర విద్యార్థులకు కోసం ఏర్పాటు చేసిన వసతి గృహం తెరుచకున్నాయి. వసతి గృహాలు మూతబడి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సాక్షి దినపత్రికలో వార్తా కథనం రావడంతో అధికారులు స్పందించారు. ఆలూరు-ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఉన్న వసతి గృహాలను సోమవారం ఏఎస్‌బిడబ్ల్యూఓ శ్రీనివాసులు తనిఖీ చేశారు. వసతి గృహాలను తెరిపించి విద్యార్థులు అందులో చేర్పించి వారితో ఏఎస్‌బిడబ్ల్యూఓ మాట్లాడారు. హెచ్‌డబ్ల్యూఓలు బదిలీలతో వసతి గృహాల ప్రారంభం కాస్త ఆల్యమైయిందన్నారు. కళాశాల వసతి గృహానికి అనిమిరెడ్డి, బీసీ బాలు వసతి గృహానికి బదిలీపై వెళ్లిన సంపత్ కుమార్ ఇన్ చార్జ్‌హెచ్ డబ్ల్యూఓగా విధులను నిర్వహిస్తారన్నారు. ఇక నుంచి విద్యార్థులకు అసౌకార్యలను కల్పించకుండా అన్ని సదుపాయాలను కలిప్తామన్నారు.

## పెద్దాసుపత్రిలో ముగ్గురికి అరుదైన ఆపరేషన్లు


ఆపరేషన్ చేయించుకున్న రోగులతో ఆసుపత్రి అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని యురాలజి విభాగంలో ముగ్గురు రోగులకు అరుదైన శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. వివరాలను సోమవారం యురాలజి విభాగంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుతో కలిసి ఆ విభాగం ఇన్‌ఛార్జి హెచ్‌వోడి డాక్టర్ పి.ముత్యశ్రీ వివరించారు.

- కోడుమూరుకు చెందిన బావన్న(75)కు మూత్రసంచి, కుడి కిడ్నీకి క్యాన్సర్ ఉంది. ల్యాప్రోస్కోపిక్ విధానంలో ఆయనకు ఈ నెల 12న కిడ్నీ, మూత్రసంచిని తొలగించారు.
- ఎమ్మిగనూరుకు చెందిన శ్రీనివాసులు(55)కు కుడి కిడ్నీలో క్యాన్సర్ ఉంది. ఈ క్యాన్సర్ శరీరంలోని పెద్ద రక్తనాళాలైన అయోట్రా, ఐవీసీకి చుట్టుపక్కల ఉన్న లింప్ గ్రంధులకు పాకి, వాటికి అతుక్కుని ఉన్నాయి. ఈయనకు ల్యాప్రోస్కొపిక్ విధానంలో 13వ తేదిన కిడ్నీతో పాటు లింప్ గ్రంధిని తీసివేశారు.
- ఆత్మకూరుకు చెందిన అఫ్జల్‌బీ(59)కి అడ్రినల్ గ్రంధిలో 12 సెం.మీల క్యాన్సర్ కణితి ఉంది. ఆమె అధిక బరువు ఉండటం వల్ల పెద్దకోత లేకుండా ల్యాప్రోస్కోపిక్ విధానంలో ఈ నెల 16న ఆపరేషన్ చేసి తొలగించారు. ఈ ఆపరేషన్‌లు డాక్టర్ ముత్యశ్రీతో పాటు యూరో ఆంకాలజిస్టు డాక్టర్ సేపూరి బాలరవితేజ, యురాలజిస్టులు రాజశేఖర్, మహేష్, అరుణ, అనెస్తెటిస్ట్ డాక్టర్ మురళీప్రభాకర్ నిర్వహించారు.